సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



ఒకటే గమనం.. ఒకటే గమ్యం

శ్రీకాకుళంలో సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాలు ముగిశాయి. క్రీడాకారులు కఠోరంగా శ్రమించారు. - 8లో



రిమ్స్ సమస్యలపై ఆరా

రిమ్స్ సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించారు. - 8లో



గజ వాహన సేవ

కాశీబుగ్గ: మందస వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. నాల్గో రోజు గురువారం వాసుదేవునికి గజ వాహనసేవ నిర్వహించారు.

● అధినేతతో ఆప్యాయంగా..

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండకు వచ్చారు. ఇటీవల కన్నుమూసిన పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పార్టీ నాయకులు వైఎస్ జగన్‌ను కలిశారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణను ఆయనకు వివరించారు.









వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు

న్యూస్‌రీల్

ఆస్పత్రి వైద్య వర్గాల్లో కలకలం

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేసిన చల్లా రవికుమార్ జారీ చేసిన సదరం సర్టిఫికెట్ల వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది. అప్పట్లో ఈయన ఇచ్చిన సదరం సర్టిఫికెట్లపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. పరిశీలన చేసిన దర్యాప్తు అధికారులు తప్పుడు సర్టిఫికెట్లుగా నిర్ధారించారు. తాజాగా ఈ సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన రవికుమార్‌తో పాటు వాటిపై సంతకాలు చేసిన అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.జయశ్రీతో పాటు మరో ఇద్దరు వైద్యులు నవీన్, నామ గల్లేశ్వరిలకు ప్రభుత్వ కార్యదర్శి మంజుల హోస్మాని బుధవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆస్పత్రిలో కలకలం రేగింది. సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన రవికిరణ్ శ్రీకాకుళం రిమ్స్‌లో పనిచేస్తుండగా మరో వైద్యురాలు నాగమల్లేశ్వరి అనధికార గైర్హాజరులో ఉన్నారు. నవీన్ టెక్కలిలో పనిచేస్తున్నారు. అప్పట్లో ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న జయశ్రీ ప్రస్తుతం నరసన్నపేటలోనే వైద్యురాలిగా పనిచేస్తున్నారు. వీరందరికీ నోటీసులు జారీ చేస్తూ.. 15 రోజుల్లో సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. వైకల్యశాతం ఆర్థో సర్జన్ నిర్ధారిస్తారని, నిబంధనల మేరకు తాము కౌంటర్ సంతకాలు చేశామని, తమకు నోటీసులు ఇవ్వడం అభ్యంతకరమని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోరం లేక సమావేశాలు వాయిదా



సభ్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న జెడ్పీ సమావేశ మందిరం

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు జరగాల్సిన మొత్తం ఏడు స్థాయీ సంఘ సమావేశాలకు కూడా జెడ్పీటీసీ సభ్యులెవ్వరూ హాజరుకాకపోవడంతో అన్ని సమావేశాలూ వాయిదా పడ్డాయి. దీంతో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ సూచనల మేరకు జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలను శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ప్రకటించారు. దీంతో అధికారులంతా ఎవరి విధుల్లోకి వారు చేరుకున్నారు.


కార్పొరేట్ సంస్థల చొరవ అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ముఖ్య ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ పరిశ్రమలు, పలు కార్పొరేట్ యాజమాన్య ప్రతినిధులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచినీటి వసతి, సోలార్ లైట్ల ఏర్పాటు, పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు తోడ్పాటు, పలాసలో డయాలసిస్ యూనిట్ల నిర్వహణ, జిల్లాలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం వంటి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. పనుల అంచనాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 31లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లలో దైన్యం



- భారీగా ధాన్యం కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపిస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో భిన్నంగా పరిస్థితులు
- పండిన పంటను కొనుగోలు చేయడం లేదని రైతుల గగ్గోలు
- కొనుగోళ్లకు, క్షేత్రస్థాయిలో ఉన్న ధాన్యానికి కుదరని పొంతన
- కీలక నేత సోదరుడి కనుసన్నల్లో గూడుపుఠాణి
- అంకెల గారడీతో నిధులు స్వాహా చేశారన్న ఆరోపణలు



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో పొలాల్లో ఇంకా కనిపిస్తున్న వరి కుప్పలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ లెక్కలకు.. వాస్తవ పరిస్థితులకు భారీ తేడా కనిపిస్తోంది. ఓ వైపు ప్రభుత్వం భారీగా కొనుగోలు చేశామని లెక్కలు చూపిస్తే.. మరోవైపు కళ్లాల్లోనే ధాన్యం బస్తాలు కనిపిస్తూ వెక్కిరిస్తున్నాయి. ఫిబ్రవరి నెలా ఖరుకు వచ్చేసింది. మరో వైపు రబీ క్రాప్ సాగు అవుతోంది. మరో మూడు నెలలు ఆగితే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అయినప్పటికీ గత ఖరీఫ్‌లో పండిన పంట నేటికీ కొనుగోలుకు నోచుకోలేదు. మరోవైపు 4లక్షల 67వేల 272 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అంత కొనుగోలు చేస్తే రైతుల వద్ద ఇంకా ధాన్యం భారీగా ఉండటమేంటి? ఇందులో ఉన్న మతలబు ఏంటి? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడి ధాన్యం అక్కడే ఉండటంతో కొనుగోల్‌మాల్ జరిగినట్టుగా స్పష్టమవుతోంది. కాగితాల్లో కొనుగోలు తప్ప క్షేత్రస్థాయిలో అనుకున్న విధంగా జరగడం లేదన్నది అర్థమవుతోంది.

జిల్లాలో పండిన పంటలో రైతుల అవసరాలు పోను విక్రయాలకు సిద్ధం చేసిన దాంట్లో నాలుగోవంతు ధాన్యం రైతుల పొలాల్లోనూ, కళ్లాల్లోనే ఉన్నాయి. గత నెలన్నర రోజులుగా తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను, నాయకులను రైతులు ప్రాధేయపడుతున్నారు. కానీ ఎవరూ కనికరించడం లేదు. సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లాలో పండిన పంటను కొనుగోలు చేయలేని నిస్సహాయ స్థితిలో యంత్రాంగం ఉంది. అదిగో ఇదిగో అని చెప్పడం తప్ప కొనుగోలు చేసిన దాఖలాలు కనబడటం లేదు. లక్ష్యాల మేరకు కొనుగోలు చేసేశామని, మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలు పూర్తి అయిపోయాయని అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో, పండిన పంటను ఏం చేసుకోవాలో తెలియని దుస్థితిలో అన్నదాతలు ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితిని జిల్లా రైతులు తొలిసారిగా చూస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల నుంచి 4లక్షల 90వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు. 4లక్షల 67వేల 272మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటివరకు కొనుగోలు చేసినట్టు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. 99,337 మంది రైతులకు రూ. 1070కోట్లు చెల్లింపులు చేసినట్టుగా చూపిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 266 మిల్లులకు కేటాయింపులు చేయడమే కాకుండా వాటిని నుంచి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)కూడా తీసుకుంటున్నారు. అధికారుల లెక్కలు సరే, క్షేత్రస్థాయిలో ఆ స్థాయిలో కొనుగోలు చేసినట్టుగా కనబడడం లేదు. దీంతో దాదాపు ప్రతి మండలంలోనూ ఎంతో కొంత ధాన్యం కొనుగోలుకు నోచుకోకుండా కళ్లాల్లోనే ఉండిపోయింది.

నిద్దాంలో ప్రభుత్వం ధాన్యంను కొనుగోలు చేయకపోవడంతో పొలంలోనే ఉన్న ధాన్యం బస్తాలివి. గత నెల 23 నుంచి ధాన్యం కొనుగోళ్లు ఆగిపోవడంతో.. దాదాపు 9వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉన్నట్లు సమాచారం. - జి.సిగడాం



అనేక అనుమానాలు

ఈ సారి ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్ జరిగినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కీలక నేత సోదరుడు కీలకంగా వ్యవహరించి, వారి అనుయాయులను మిల్లర్ల పెద్దలుగా పెట్టి, గూడు పుఠాణీ నడిపి, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు విమర్శలు వస్తున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేయకుండానే, కొనుగోలు చేసినట్టు చూపించి, ఆ ధాన్యాన్ని మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించినట్టుగా పొందుపరిచి, వాటి నుంచి పీడీఎస్ బియ్యాన్ని సీఎంఆర్‌గా తీసుకున్నట్టుగా మిస్టరీ నడిపి, ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు జరిగినట్టు, రైతులకు చెల్లింపులు చేసినట్టుగా మాయాజాలం చేసి అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తోంది.

ఈ ఆరోపణలు, విమర్శలు, వాదనలు వాస్తవమా? కాదా? అన్నది తేలాలంటే మిల్లర్ల వారీగా కేటాయించిన ధాన్యం, వాటి నుంచి వచ్చిన సీఎంఆర్‌ను సమగ్రంగా పరిశీలించి, విచారణ జరపాల్సిందేనని రైతులు కోరుతున్నారు.

దళారులకే అమ్మాల్సి వస్తుంది..



రైతులు దళారులకే ధాన్యం అమ్మాల్సి వస్తోంది. సన్న ధాన్యంకు కనీసం మద్దతు ధర లేదు. దీంతో ఇంకా పొలాల్లోనే కుప్పలు ఉన్నాయి.

– ఎస్.శ్యామలరావు, రైతు, ఇబ్రహింబాద్

ఉన్నతాధికారులకు నివేదించాం..



మండలంలో మరో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ధాన్యం కొనుగోలు జరుగుతుంది.

– ఎం. శ్రీకాంత్, తహసీల్దార్, జి.సిగడాం

లక్ష్యం పేరిట నిర్లక్ష్యం

గత నెలన్నర రోజులుగా ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో మందగించాయి. తమకు కేటాయించిన లక్ష్యం పూర్తయిపోయిందని మిల్లర్లు చెబుతుండగా, అవునని అధికారులు చెప్పుకొస్తున్నారు. ఫలితంగా పండిన పంటను అమ్ముకోలేని దుస్థితిలో రైతులు ఉన్నారు. ఎప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో జిల్లాలో ఇప్పటికే 20వేల నుంచి 30వేల టన్నుల ధాన్యాన్ని దళారులకు విక్రయించినట్టు తెలుస్తోంది. దీనివల్ల సంబంధిత రైతులు మద్దతు ధరను కోల్పోయారు. దళారులు ఎంత చెబితే అంతకు ఇచ్చేసిన పరిస్థితులు ఉన్నాయి. వాస్తవంగా ఏ గ్రేడ్ రకమైతే 100కిలోలు రూ.2320, 80కిలోలు రూ.1856, 40కిలోలు రూ.928 మేర మద్దతు ధర ఉండగా, కామన్ రకమైతే 100కిలోలు రూ.2300, 80కిలోలు రూ.1840, 40కిలోలు రూ.920 మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రభుత్వం అనుకున్న మేర కొనుగోళ్లు చేయకపోవడంతో దళారులకు మద్దతు ధరకు నాలుగైదు వందలు తక్కువ చేసి విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏపీ గురుకులం భూముల కబ్జా

- బరితెగిస్తున్న తెలుగు తమ్ముళ్లు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకుల భూములపై కన్ను
- ఆక్రమణదారులపై ఈ ఏడాది జూలైలో ఫిర్యాదు
- తాజాగా మళ్లీ సరిహద్దులు దాటి ఆక్రమణకు పాల్పడుతున్న పరిస్థితి
- మళ్లీ ఫిర్యాదు చేసిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్




సరిహద్దులు దాటి కబ్జాకు గురవుతున్న ఏపీ గురుకుల పాఠశాల భూమి (ఇన్‌సెట్లో) ఎస్‌ఎంపురంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎంపురంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల స్థలాలను తెలుగు తమ్ముళ్లు దర్జాగా కబ్జా చేస్తున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పాలో.. వీరి బారి నుంచి బడిని కాపాడుకోవాలో తెలీక అక్కడి టీచర్లు సతమతమవుతున్నారు. అధికారంలోకి రావడమే తరువాయి టీడీపీ నాయకులు బరి తెగించారు. ఇప్పటికే అధికారులకు పలు పర్యాయాలు పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. అయినా అక్రమార్కులు వెనక్కి తగ్గడం లేదు. అదే పనిగా పాఠశాల భూముల్లో పాగా వేస్తున్నారు. తాజాగా పాఠశాల ప్రహరీ హద్దులను దాటి కబ్జాకు పాల్పడ్డారు. దీనిపై అటు ఎస్‌ఐకు, ఇటు వీఆర్‌ఓకు గురువారం ఫిర్యాదు చేశారు.

గురుకుల భూములపై కన్ను

ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎంపురంలో 1984లో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రెసిడెన్సియల్ స్కూల్ సొసైటీ పేరుతో స్థానికుల నుంచి భూములను కొనుగోలు చేశారు. సంపతిరావు, వావిలపల్లి, గురుగుబిల్లి కుటుంబీకుల నుంచి 13.7ఎకరాలను సొసైటీ కొనుగోలు చేసింది. ఇది కాకుండా ప్రభుత్వం మరో 40ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా గురుకుల పాఠశాలకు కేటాయించింది. మొత్తంగా సుమారు 54ఎకరాలు రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ పేరు మీదే ఉంది. ఇవన్నీ సర్వే నంబర్ 112 సబ్ డివిజన్ 635/2లో ఉన్నాయి. ఈ భూముల్లో కొంతమేర భవనాలు నిర్మించారు. మిగతా భూమిని భవిష్యత్ అవసరాల కోసం ఉంచారు. ఖాళీగా ఉన్న భూములపై అక్కడి కీలక నేతల కన్ను పడింది. తమ బినామీలను రంగంలోకి దించి దశల వారీగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. తొలుత 2014–19లో టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడు ఒకరిద్దరు గురుకుల పాఠశాల భూములను ఆక్రమించి, చదును చేసి నీలగిరి మొక్కలు వేసేశారు.

మళ్లీ అధికారంలోకి వచ్చాక

మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆక్రమణదారులు చొరబడ్డారు. తమ కుటుంబీకులే అప్పట్లో రెసిడెన్షియల్ సొసైటీకి భూములు విక్రయించారని, ఆ భూములను 20ఏళ్ల లోపు వినియోగించకపోతే తిరిగి అసలు యజమానుల కుటుంబీకులు స్వాధీనం చేసుకుని, చదును చేసుకుని, తమ అవసరాలకు వినియోగించుకోవచ్చన్న కారణాలు చూపించి గురుకుల పాఠశాల భూములను ముగ్గురు దర్జాగా చదును చేసి ఆక్రమించారు. వాస్తవంగా రెసిడెన్షియల్ సొసైటీ కొనుగోలు చేసిన భూములకు ఆక్రమణదారులు చెప్పిన నిబంధన వర్తించదు. సొసైటీ పేరుతో రిజిస్ట్రైన భూములను భవిష్యత్‌లో అవసరాల దృష్ట్యా ఎప్పుడైనా వినియోగించుకోవచ్చు. కోర్టు కూడా స్పష్టమైన తీర్పు ఇచ్చింది. కానీ ఖాళీగా ఉందని కొందరు, డీ పట్టా భూమి ఉందని మరొకరు అక్రమంగా చదును చేసేశారు. దీనిపై ఈ ఏడాది జూలైలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ జరిపారు. వివాదాస్పద భూములతో పాటు భూములకు హద్దులు నిర్ణయించారు.

తాజాగా సరిహద్దులు దాటి కబ్జా

ఐదు నెలల కింద అంతా విచారణ జరిపి, హద్దులు ఫిక్స్ చేయగా, ఇప్పుడా హద్దులు దాటి అధికార పార్టీకి చెందిన వ్యక్తి గురుకుల పాఠశాల భూమిని కబ్జా చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ తదితర సిబ్బంది అభ్యంతరం తెలిపినా వెనక్కి తగ్గలేదు. తన కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఎంత చెప్పినా బరితెగించి, భూములకు ఆక్రమిస్తుండటంతో గురువారం ఎస్‌ఎంపురం వీఆర్‌ఓకు, ఎచ్చెర్ల స్టేషన్ ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణపై ఫిర్యాదు

ఐదు నెలల క్రితం రెవెన్యూ అధికారులు సరిహద్దులు నిర్ణయించారు. ఆ సరిహద్దులు దాటి కబ్జా చేస్తున్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి, పాఠశాల భూములను కాపాడాలని అటు వీఆర్‌ఓ, ఇటు పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– ఎం.గుణస్వామి, ఏపీ గురుకుల పాఠశాల ఎస్‌ఎంపురం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి

- మార్ఫింగ్ వీడియోలను పోర్న్ సైట్‌లో పెట్టిన యువకుడు
- టెలిగ్రామ్‌లో వీడియోలు పెట్టి డబ్బులు చేసుకున్న మరో యువకుడు
- వివరాలు వెల్లడించిన సీఐ పి.ఈశ్వరరావు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఒళ్లు గగుర్పాటు కలిగించే విషయాలు వెలుగు చూశాయి. విద్యార్థినితో చనువు పెంచుకున్న ఓ యువకుడు ఆమె ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఏకంగా పోర్న్ వెబ్‌సైట్‌లో పెట్టిన అకృత్యాన్ని పోలీసులు పసిగట్టారు. మరొక యువకుడు ఇలాగే మార్ఫింగ్ వీడియోలను టెలిగ్రామ్‌లో షేర్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. విద్యార్థిని ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణలో అనేక విషయాలు బయటకు వచ్చాయి. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

విద్యార్థినికి తెలియకుండానే..

చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్‌కు జిల్లాలో చదువుతున్న విద్యార్థినితో పరిచయం ఉంది. ఆ విద్యార్థినితో చనువుగా ఉంటూ ఆమెకు తెలియకుండానే ఆమె చిత్రాలను, వీడియోలను తీసేవాడు. కొన్నాళ్లకు ఆమె వీడియోలను, ఫొటోలను న్యూడ్‌గా మార్ఫింగ్ చేశాడు. తెలియని నంబర్ నుంచి ఆమె వాట్సాప్‌కు ఫొటోలను, వీడియోలను పంపుతూ లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు.

ధైర్యంగా ఫిర్యాదు చేసి..

ఇలా ఎవరు చేస్తున్నారో తెలియని విద్యార్థిని మొదట్లో తీవ్ర వేదన అనుభవించింది. తల్లిదండ్రులకు, పోలీసులకు చెబితే పరువు పోతుందని మొదట్లో భావించింది. కానీ ధైర్యం చేసి ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఈశ్వరరావు విచారణ ఆరంభించి పరిచయస్తుల పనే అని భావించి తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్ అని తెలుసుకుని నాలుగు రోజుల కిందట తిరుపతిలో ఉంటున్న అతనికి నోటీసులు పంపారు.

మరో దొంగ..

సోయల్‌ను విచారించడం, ఆయన ఫోన్‌ను క్షుణ్ణంగా పరిశీలించడంతో విద్యార్థిని ఫొటోలు, వీడియోలు వెబ్‌పోర్న్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం చూశారు. అవే చిత్రాలు, వీడియోలు ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌ల్లో సైతం ఎలా అప్‌లోడ్ అయ్యాయన్నది అర్థం కాక జిల్లా సైబర్ సెల్ బృందాన్ని రంగంలోకి దింపారు. వారు ఇన్‌స్టా, టెలిగ్రామ్ యాజమాన్యాలకు మెయిల్‌లో ఫిర్యాదు పంపగా అటునుంచి వారు ఐడీలు, ఫోన్ నంబర్ పంపించారు. అవి కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన ఉప్పుగళ్ల రఘువిగా గుర్తించి అతనికి నోటీసులు పంపారు. గురువారం రఘు స్టేషన్‌కు రాగా విచారించారు.

ఒప్పుకున్నాడు..

పోర్న్‌సైట్‌లో వచ్చిన వీడియోలను అప్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లలో పెట్టింది తానేనని, ఒకసారి లింక్ చేసే ముందు తనకు రూ. 200లు పంపించాలని చెప్పడంతో చాలామంది తనకు డబ్బు పంపారని రఘు చెప్పారు. విస్తుపోయే నిజాలు తెలియడంతో సీఐ ఈశ్వరరావు గురువారం రాత్రి ఇరువురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వీడియోలు మార్ఫింగ్ చేస్తే సహించేది లేదు

సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా పోస్టులు పెట్టినా, వీడియోలు మార్ఫింగ్ చేసినా సహించేది లేదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా వినాయకం బాధ్యతల స్వీకరణ


వినాయకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కుడిమి వినాయకం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో పల్నాడు జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ అందజేసేలా కృషి చేస్తానన్నారు.

ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగన్నాయకులు


దువ్వు జగన్నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా అదనపు జడ్జి కోర్టు, జిల్లా ఫ్యామిలీ కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సోంపేట కోర్టు పీపీ దువ్వు జగన్నాయకులు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టుకు వచ్చిన ఈయన న్యాయమూర్తులను, బార్ సభ్యులను, ఇప్పటి వరకు పీపీ బాధ్యతలు నిర్వర్తించిన వాన కృష్ణచంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, జిల్లా బార్ ప్రతినిధులు మరిసర్ల అన్నంనాయుడు, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఎస్.వెంకటరావు, కొమ్ము రమణమూర్తి, టి.ఖగేంద్రనాథ్, ఎన్.శ్రీరామమూర్తి, బొత్స సుదర్శన్, టి.రామారావు, ఎన్.దుర్గా శ్రీనివాసరావు, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నగలు రికవరీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని చిట్టిమండలం కాలనీలో నివాసముంటున్న ఎ.లక్ష్మి ఇంట్లో చోరీ ఘటనకు సంబంధించి నాలుగు తులాల బంగారు నగలు రికవరీ చేసి బాధితురాలికి అప్పగించామని సరుబుజ్జిలి ఎస్సై బి.హైమావతి గురువారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో మహిళ దొంగతనం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నగలు రికవరీ చేసి బాధితురాలికి అప్పగించామని తెలిపారు.


సాఫ్ట్‌బాల్ గేమ్ సాధనలో క్రీడాకారులు



ఒకటే గమనం.. గమ్యం

- శ్రీకాకుళంలో ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణా శిబిరాలు
- పతకమే లక్ష్యంగా కఠోర సాధన
- హాజరైన 50 మంది అథ్లెట్లు, కోచ్‌లు
- ఈ నెల 22 నుంచి మహారాష్ట్రలో సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

నేషనల్ మీట్‌కు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్స్ పురుషులు, మహిళల జట్లకు శిక్షణా శిబిరాలు గురువారంతో ముగిశాయి.జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా సాగిన ఈ శిబిరాల్లో రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొని నాలుగు రోజులుగా కఠోర సాధన చేశారు. గేమ్‌లో మెలకువలతోపాటు ఫిట్‌నెస్‌పై తర్ఫీదు పొందారు. జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు పతకమే లక్ష్యంగా ఇక్కడ సాధన కొనసాగింది. ఏపీ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టుకు ఎంపికైన ఆరుగురు అంతర్జాతీయ క్రీడాకారులు ఈ శిబిరాల్లో పాల్గొనడం విశేషం. ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా నుంచి మొత్తం ముగ్గురు(ఇద్దరు పురుషులు, ఒక మహిళ) క్రీడాకారులు ఏపీ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

50 మందితో రెసిడెన్షియల్ క్యాంప్..

ఏపీ రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లతో కలిపి మొత్తం 50 మందితో ఇక్కడ సాఫ్ట్‌బాల్ సంఘం తరఫున రెసిడెన్షియల్ కోచింగ్ పొందారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, కన్వీనర్ వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమన పర్యవేక్షించారు. క్రీడాకారులకు సీనియర్ ఏపీ సాఫ్ట్‌బాల్ కోచ్ ఎం.బద్రీనారాయణ(గుంటూరు), కోచ్ కమ్ నేషనల్ రిఫరీ జి.మహేష్ (నెల్లూరు), సీనియర్ ప్లేయర్ కమ్ కోచ్ ఇ.ఉమా మహేశ్వరి (కర్నూలు), జిల్లాకు చెందిన పలువురు పీడీలు శిక్షణ అందించారు. మహారాష్ట్రలోని అమరావతి వేదికగా ఈ నెల 22 నుంచి 26 వరకు జరగనున్న 46వ ఆలిండియా సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో వీరంతా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు గురువారం క్రీడాకారులు పయనమయ్యారు.



ఈ ఆరుగురు అంతర్జాతీయ క్రీడాకారులే..

కోచ్ బద్రీనారాయణతో కలిసి కనిపిస్తున్న వీరంతా అంతర్జాతీయ క్రీడాకారులే. పి.జయవర్ధన్ (అనంతపురం), బి.ఫృథ్వీరాజ్ (అనంతపురం), ఆర్.లోకేష్ (చిత్తూరు), ఎం.బద్రీనారాయణ (కోచ్–గుంటూరు), బి.మహేష్ (అనంతపురం), బి.రాంబాబు (గుంటూరు), పి.గౌతమ్‌రాజ్ (కర్నూలు)జపాన్, నేపాల్, హాంకాంగ్ వేదికగా జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్లలో భారత జట్లకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు.

సిక్కోలు క్రీడాకారులు..

శ్రీకాకుళం జిల్లా నుంచి ఏపీ సీనియర్స్ జట్టుకు ముగ్గురు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు సిద్దార్థ మహరాణ (మందస), బుడు మూరు రామ్మోహన్ (కేశవరావుపేట గ్రామం- ఎచ్చెర్ల మండలం), మహిళల జట్టుకు గురుగుబెల్లి దుర్గాప్రశాంతి (కేశవరావుపేట) ఎంపికయ్యారు. వీరు ముగ్గురు పలు జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు.




వీడ్కోలు కార్యక్రమంలో క్రీడాకారులతో సంఘ నాయకులు కలిదిండి వెంకటరామరాజు, ఎం.వి.రమణ, సూర శ్రీనివాసరావు, పి.సుందరరావు, తిరుపతిరావు, మాధవరావు తదితరులు

వ్యవసాయ కుటుంబం..



మాది వ్యవసాయ కుటుంబం. నారాయణ, అక్కమ్మ మా తల్లిదండ్రులు. డిగ్రీ సెకెండియర్ చదువుతున్నాను. నేను 15నేషనల్స్, 20కి పైగా స్టేట్‌మీట్స్‌లో పాల్గొని అనేక పతకాలు సాధించాను. పీఈటీ కావడమే నా లక్ష్యం.

– తలారి లక్ష్మి, అనంతపురం జిల్లా

ఉద్యోగమే లక్ష్యం..



మాది కృష్ణా జిల్లా విజయవాడ. స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. శ్రీకాకుళం రావడం ఇదే మొదటిసారి. నేను 2 నేషనల్స్, 6 స్టేట్‌మీట్స్ ఆడాను. ఇంటర్ సెకెండియర్ ఎంపీసీ చదువుతున్నాను.

– లేళ్ల పూర్ణశ్రీ, విజయవాడ, కృష్ణా జిల్లా

ఆత్మీయత మరువలేం



శ్రీకాకుళం జిల్లాకు పోటీల కోసం, శిక్షణా శిబిరాల కోసం వస్తే మాకు పండగే. మా సొంత జిల్లా కంటే కూడా మమ్మల్ని బాగ చూసుకుటారు. ఆదరిస్తారు. ఈ ఆత్మీయత మరువలేం. రాష్ట్ర పునర్విభజన తర్వాత నా సారధ్యంలో 12 నేషనల్ మీట్స్‌లో పాల్గొన్నాను. ఆరు మెడల్స్ సాధించాం.

– ఎం.బద్రీనారాయణ, గుంటూరు, ఏపీ సాఫ్ట్‌బాల్ సీనియర్ కోచ్

జిల్లాకు గర్వకారణం..



మహారాష్ట్రలో త్వరలో జరిగే సీనియర్ నేషనల్ మీట్‌లో పాల్గొనే ఏపీ జట్లకు శిక్షణా శిబిరాలను నిర్వహించడం గర్వకారణంగా ఉంది. క్రీడాకారులు క్రమశిక్షణగా సాధన చేసి, శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా సంఘ ప్రతినిధులు, పీడీలు ప్రోత్సాహం మరువలేనిది.

– కలిదిండి నరసింహరాజు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

హామీలు అమలు కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. లేకుంటే ఉద్యమాలు తప్పవని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. శుక్రవారం నగరంలోని క్రాంతి భవన్‌లో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అప్పటి ప్రతిపక్షనేతగా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ ఉద్యోగవర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి ఎస్టీయూ సంఘం తరఫున పోస్టుకార్డులు పంపే ఉద్యమాన్ని ప్రారంభించారు. వెంటనే పీఆర్సీని అమలు పర్చేలా చర్యలు చేపట్టాలని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు, పెండింగ్ డీఏలను ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ, శ్రీనివాసరావు, రామారావు, శ్రీధర్, తేజ, లక్ష్మణరావు, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గోవుల వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనం

సరుబుజ్జిలి: కబేళాకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 28 గోవులను పట్టుకున్నట్లు ఎస్సై బి.హైమావతి తెలిపారు. హిరమండలం నుంచి వాహనాల్లో పశువుల రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో గురువారం సరుబుజ్జిలి జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. మూడు వాహనాల్లో ఉన్న 8 మందిని విచారణ చేయగా ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గోవులను కొనుగోలుకు చేసి కబేళాకు తరలించినట్లు నిర్ధారణకు వచ్చామని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసి ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. గోవులను విజయనగరం జిల్లా గుర్ల‌ంగివలస గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రిమ్స్ సమస్యలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల సమస్యలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. 'రిమ్స్ విద్యార్థుల ఆకలి కేకలు, రిమ్స్ హాస్టల్లో కాలకృత్యాలుకూ కష్టమే' శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. తొలుత విద్యార్థి నాయకులను పిలిపించి మాట్లాడారు. హాస్టల్‌లో మెస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నడుస్తోందని, వారు సరైన ఆహారం సరఫరా చేయని పక్షంలో వారిని మార్చే వెసులుబాటు ఉందన్నారు. విద్యార్థులంతా సమావేశమై ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్, వార్డెన్లతో మాట్లాడి సరైన ఆహారం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీఎంహెచ్ఐడీసీ అధికారులను పిలిపించి మరుగుదొడ్ల సమస్య లేకుండా చూడాలన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని, తాగునీరు సమస్య పరిష్కరించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జాతీయ రహదారిలో పెద్దబమ్మిడి సమీపంలో ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావుపేట గ్రామానికి చెందిన బాన్న ప్రత్యూష(29) గురువారం మృతి చెందింది. తన భర్త నడుపుతున్న ఆటోలో ప్రయాణిస్తూ కారును ఢీకొనడంతో ప్రత్యూష తీవ్రంగా గాయపడింది. భార్యభర్తలు ఇరువురు డాన్సు మాస్టర్లుగా పని చేసేవారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎస్ఐ వి.సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ మృతదేహం నగర వాసిదే


దండు త్రినాథరావు (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని హయాతినగరం సమీప నాగావళి నదీ తీరంలో బుధవారం కలకలం రేపిన మృతదేహం వివరాలను పోలీసులు గుర్తించారు. మీడియాలో కథనాలు చూసి కుటుంబ సభ్యులే గుర్తుపట్టి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని తోటపాలెం జంక్షన్ సమీప నీలమ్మకాలనీకి చెందిన దండు త్రినాథరావు (45) మద్యానికి బానిసయ్యాడు. ఎప్పటికప్పుడు ఇంటి నుంచి బయటకెళ్లి కొన్నాళ్ల తర్వాత తిరిగొచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇలా జరుగుతుందని అనుకోలేదని భార్య వెంకటలక్ష్మి వాపోయారు. త్రినాథరావు పీఎస్ఎన్ఎం స్కూల్ సమీప దుకాణంలో కమ్మరి పనిచేస్తుండేవాడు. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న చింతాడ రవికుమార్, ప్రతినిధులు

ఆమదాలవలస : సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో వేల ఎకరాల్లో చేపట్టనున్న థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో ఆదివాసీలు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారని, కూటమి ప్రభుత్వ చర్యను అడ్డుకుని స్థానికులకు న్యాయం చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. గురువారం పాలకొండ విచ్చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని సరుబుజ్జిలి, బూర్జ థర్మల్ పవర్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి అత్తులూరి రవికాంత్, ఆయా మండలాల నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పరిశీలించిన జగన్ తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు రవికుమార్ తెలిపారు. పేదలకు అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదన్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పోరాట కమిటీ నాయకులు సురేష్‌దొర, ఆమదాలవలస నియోజకవర్గ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు అద్భుతం



కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ముఖద్వారం


ఎద్దు గోపాలదాసునాయుడు, మొదటి ప్రిన్సిపాల్

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. కాలేజీ గోల్డెన్ జూబ్లీని శుక్రవారం నిర్వహించేందుకు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. 1974లో కాలేజీ ఏర్పాటైంది. కాలేజి మొదటి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసు నాయుడు. ప్రస్తుతం కాలేజీలో 300 మంది వరకు చదువుతున్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఘనతను ఈ కాలేజీ సొంతం చేసుకుంది. ఇక్కడ చదువుకున్న వారు ఎంతో మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొత్తూరులో కాలేజీ ఏర్పాటు కోసం స్థానిక నాయకుడు లోతుగెడ్డ చంద్రయ్య నాయుడు, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు కృషి చేశారు. 1972 ఏడాది నుంచి కాలేజీ కోసం ప్రయత్నాలు చేయగా 1974లో ఏర్పాటైంది. మొదట ఉన్నత పాఠశాల గదుల్లో తరగతులు ప్రారంభించారు. కొత్తూరు, భామిని, హిరమండలం, సీతంపేట, ముమ్మలక్ష్మిపురంతో పాటు పలు ప్రాంతాలకు ఈ కాలేజీ ఎంతో కీలకంగా నిలిచింది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఏఆర్వోలను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. విశాఖ జిల్లా ఏఆర్వో బిహెచ్.భవానీ శంకర్, అల్లూరి జిల్లా ఏఆర్వో పద్మలత, అనకాపల్లి జిల్లా ఏఆర్వో పీవీఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, విజయనగరం జిల్లా ఏఆర్వో శ్రీనివాసమూర్తి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఏఆర్వోలు పాల్గొన్నారు.